సాక్షి రంగారెడ్డి

బుధవారం । 14 । జూన్ । 2023



దొంగలకు రిమాండ్

పశువులను దొంగిలించిన వ్యక్తులను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. 8లో▸



కఠినతరం చేయండి

విద్యాహక్కు చట్టాన్ని కఠినతరం ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



శ్మశానవాటిక కబ్జా!

మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడ దళితుల శ్మశాన వాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆలయ భూముల పరిశీలన



బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద విజిలెన్స్ అధికారుల బృందం

తుర్కయంజాల్: తెలంగాణ విజిలెన్స్ అధికారుల బృందం రెవెన్యూ, దేవాదయ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ భూములను పరిశీలించారు. ఆలయ భూము ల కబ్జా వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు స్వయంగా పరిశీలించారు. ఇంజాపూర్ సర్వే నంబర్ 130లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి, రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతిని కోరారు.

మహేశ్వరం సీఐగా ముని

మహేశ్వరం: మహేశ్వరం కొత్త సీఐగా రాచకొండ పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.ముని రానున్నారు. ఈ మేరకు మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎం.మధుసూదన్‌ను భువనగిరి ట్రాఫిక్–1 పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసింది. ఎన్నికల నేపథ్యం, మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

చెరువు కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు



చెరువులో డంప్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు శిఖం సర్వే నంబర్ 137లో మట్టి, బండరాళ్లు డంప్ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ హైదర్‌ఖాన్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో మంగళవారం సమావేశమై చెరువు పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. కబ్జాదారులపై వాల్టా, పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరుతూ వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువులో డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించి, వారికి వివరాలను సమర్పించామన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఉషారాణి, ఏఈఈ గంగమ్మ, ఆర్ఐ భిక్షపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, వీఆర్ఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దయానంద్ గౌడ్



బండి సంజయ్‌తో దయానంద్ గౌడ్

తుర్కయంజాల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌కు చెందిన నోముల దయానంద్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దయానంద్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

బాలాపూర్ నుంచి శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన కొలన్ శంకర్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కొంగరకలాన్ నుంచి అశోక్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొంగరకలాన్‌కు చెందిన కొత్త అశోక్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అశోక్‌గౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

‘ప్రైవేటు’ దందా

ఆయా స్కూళ్ల ఇష్టారాజ్యం

- యథేచ్ఛగా స్టేషనరీ సామగ్రి విక్రయం
- ఎంఆర్‌పీకి మించి వసూళ్లు
- ‘ఓన్లీ క్యాష్’ అంటూ మెస్సేజ్‌లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



హస్తినాపురంలోని ఓ ఇంట్లో పుస్తకాలు విక్రయిస్తుండగా తీసుకెళ్తున్న విద్యార్థులు

గత విద్యా సంవత్సరం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు

అంశం	సంఖ్య	విద్యార్థులు
ప్రైవేటు పాఠశాలు	1,319	3,99,822
ఎయిడెడ్	14	1,595
సీబీఎస్ఈ స్కూళ్లు	90	86,106
ఐసీఎస్ఈ స్కూళ్లు	7	5,316

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు చిల్లర దందాకు తెగబడ్డాయి. నిబంధనలకు చిక్కకుండా స్కూలు పక్కనే గుట్టుగా ఓ దుకాణం తెరిపించి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నాయి. పెన్నులు, పెన్సిల్స్, టెక్ట్స్‌బుక్స్, నోట్ బుక్స్ మొదలు.. యూనిఫాం, బెల్ట్, టై, డైరీ, లంచ్ బాక్స్, బ్యాగ్స్, షూస్ ఇలా విద్యార్థులకు కావాల్సినవన్నీ అక్కడే విక్రయిస్తున్నాయి. ఉత్పత్తి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని, వాటిపై స్వయంగా స్కూలు పేరు సహా ఎంఆర్‌పీ ధరలను ముద్రించుకుని బలవంతంగా విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన వాటిని అనుమతించబోమని తేల్చి చెబుతుండటంతో తల్లిదండ్రులు చేసేది లేక అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఓన్లీ క్యాష్

తమ ప్రత్యేకతను చాటుకునేందుకు యాజమాన్యాలు పోటీపడుతున్నాయి. ప్రత్యేక ప్యాట్రన్‌లు రూపొందించుకుని ఆ మేరకు ఆయా స్కూళ్ల పేరుతో ప్రత్యేకంగా పాఠ్యపుస్తకాలు ముద్రి స్తున్నాయి. ప్రింట్ ఖరీదుకు మించి ఎంఆర్‌పీ ధరలను ముద్రిస్తున్నాయి. విద్యార్థులు కొనుగోలు చేసిన పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం ఇతర వస్తువులకు ఏటీఎం, పేటీఎం వంటి ఆన్‌లైన్ పేమెంట్లు నిరాకరిస్తున్నాయి. కేవలం నగదు చెల్లింపు దారులకే వీటిని విక్రయిస్తున్నాయి. జీఎస్టీ అధికారులకు ఏ మాత్రం చిక్కకుండా జాగ్రత్త వహిస్తున్నాయి. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా దుకాణాల చిరునామాలు పంపుతున్నాయి.

ఓ సాధారణ బడ్జెట్ స్కూల్లో ధరలు ఇలా

యూనిఫాం (ఒకజత)	రూ.1000–1,200
బెల్ట్	రూ.80–100
టై	రూ.50–60
డైరీ	రూ.100–120
బ్యాగు	రూ.600–800
లంచ్‌బాక్స్	రూ.150–450
షూస్	రూ.250–350
ఐదు టెక్ట్స్/ పది నోట్ బుక్స్	రూ.4,500–6,500

మార్కెట్ ధరల కంటే ఎక్కువ

నాకు ఇద్దరు పిల్లలు. స్థానికంగా ఓ బడ్జెట్ స్కూల్లో చేర్పించాను. స్కూలు పునః ప్రారంభానికి ముందే మెస్సేజ్ వచ్చింది. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఇతర స్టేషనరీ సహా షూస్, బ్యాగులు, లంచ్ బాక్స్‌లు, టై, బెల్ట్, డైరీలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. కేవలం పుస్తకాలకే రూ.15 వేలు వెచ్చించాల్సి వచ్చింది. ఇంకా యూనిఫాం, ఇతర స్టేషనరీ తీసుకోలేదు. బహిరంగ మార్కెట్లో లభించే ధరలతో పోలిస్తే ఇక్కడ ఎక్కువే తీసుకుంటున్నారు.

– సంధ్య, పేరెంట్

సహించేది లేదు

ప్రభుత్వ విద్యా సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ట్యూషన్ ఫీజుల పెంపు, పాఠశాల ఆవరణలో పుస్తకాలు, ఇతర స్టేషనరీ అమ్మకాలపై ఏటా ఆందోళనలు చేస్తూనే ఉన్నాం. ప్రైవేటు పాఠశాలలతో విద్యాశాఖాధికారులు కుమ్మక్కయ్యారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రుల్లో ఉన్న బలహీనతను అవకాశంగా తీసుకుని అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్న యాజమాన్యాలను వదిలిపెట్టం.

– మాసారం ప్రేమ్‌కుమార్, అధ్యక్షుడు, సీజేఎస్

మహిళా సంక్షేమమే ధ్యేయం

మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: ప్రతి ఆడబిడ్డ సంతోషంగా ఉండేలా ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళా సంక్షేమ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్‌లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆడబిడ్డ సంతోషంగా ఉంటేనే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందన్నారు. గర్భిణుల్లో రక్తహీనత సమస్య తొలగించడానికి 11 మంది మహిళా ఐఏఎస్ అధికారులను కేరళకు పంపించి న్యూట్రిషన్ కిట్లు అందించాలని అధ్యయనం చేయించారన్నారు. ఇందులో భాగంగానే మొదటగా తొమ్మిది జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఈ దశాబ్ది ఉత్సవాల్లో అమలు చేస్తున్నారన్నారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్ల సేవలు ఎంతో గొప్పవని, వారు సమాజంలో అమ్మ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. 12 వేల మంది ఐకేపీ గ్రూప్‌ల మహిళలకు స్త్రీనిధి ద్వారా చిరు వ్యాపారాలు చేసుకునేందుకు లక్ష రూపాయల చొప్పున అందించినట్లు తెలిపారు. 48 లక్షల మంది పింఛన్‌దారుల్లో 28 లక్షల మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో 3 వేల మందికి షాదీ ముబారక్ పథకం అమలైందన్నారు. రూ.540 కోట్ల రుణాలు మహిళలకు అందించామన్నారు. షీ టీమ్‌లతో మహిళలకు భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలతో పాటు మహిళలపై జరుగుతున్న ఇతర మోసాలపై ఫోన్ చేసి సహాయం పొందొచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. ఇందుకు సంబంధించి రాచకొండ పోలీస్ కమిషనరేట్ హెల్ప్‌లైన్ 87126 62662ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డి, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, జెడ్పీటీసీ జంగారెడ్డి, ఆర్డీవో సూరజ్‌కుమార్, డీఆర్‌డీఏ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా రుణాలకు సంబంధించిన చెక్‌ను అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహిళల అభ్యున్నతికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

- కలెక్టర్ హరీశ్

షాద్‌నగర్: ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని కలెక్టర్ హరీశ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాట య్యాక ప్రభుత్వం మహిళల అభ్యున్నతి, సాధికారత ధ్యేయంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. వివాహిత మహిళలకు కుటుంబ సమస్యలను అధిగమించేందుకు కావాల్సిన ధైర్యాన్ని ఇచ్చి వారికి తాత్కాలికి ఆవాసం కల్పించేందుకు సఖి కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా టీ హబ్ ద్వారా చిన్న, మధ్య తరహా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల్లో యువతుల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఆడ పిల్ల పుట్టడమే శాపంగా భావించిన పరిస్థితుల నుంచి వారి పుట్టుకతోనే కుటుంబాల్లో సంతోషం, సమాజంలో మార్పు వస్తుందన్న స్థాయికి తీసుకరావడం జరిగిందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చీరల పంపిణీ, గ్రామీణ సహాయక సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలను అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభు త్వం ఎంతో కృషి చేస్తోందని గుర్తు చేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ.22.88 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్ర విశాల, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, ప్రత్యేక అధికారి వెంకట్, తహసీల్దార్ గోపాల్, సీడీపీఓ నాగమణి, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ప్రతి నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న నిర్వహించనున్న వైద్య ఆరోగ్య దినోత్సవానికి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని ఎస్‌వైఆర్ గార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే వేడుకలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పాల్గొంటారని తెలిపారు. అర్హులైన వారికి న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

15న పల్లె ప్రగతి, 16న పట్టణ ప్రగతి దినోత్సవాలు

గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో జాతీయ పతాకావిష్కరణ చేయాలని, పల్లె ప్రగతి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. పట్టణ ప్రగతి ద్వారా కార్పొరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

మీరే సారథులు వారధులు

రాబోయే ఎన్నికలే లక్ష్యం

- పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలి
- పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన ఫలాలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాలను వినియోగించుకోండి
- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం

సాక్షి, సిటీబ్యూరో: ఓవైపు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్తూనే మరోవైపు పార్టీ బలోపేతానికి బాగా పనిచేయాలని మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. ఈ నెల 16న నగరంలోని 150 వార్డుల్లో వార్డు కార్యాలయాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రగతి భవన్‌లో పార్టీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానున్న సంవత్సరకాలం పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ఉంటాయని, వాటన్నింటినీ విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయాలన్నారు. సమావేశాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని, పార్టీ బలోపేతం ద్వారానే మనం రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తామన్నారు. కార్పొరేటర్ల సారథ్యంలో తమతమ వార్డుల్లో పార్టీని ఎన్నికలకు సమాయత్తం చేయాలన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం..

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతోపాటు నగరాభివృద్ధికి పాటు పడుతున్న తీరును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి మార్గదర్శనం చేశారు. వార్డు కార్యాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ వారితో మమేకమయ్యే అవకాశం ఏర్పడుతుందన్నారు. నగరంలో సుపరిపాలన మరింత బలోపేతం కానుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు వార్డు కార్యాలయాల వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. దాదాపు ఆర్నెల్లలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండటం తెలిసిందే. ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యమని మంత్రి పునరుద్ఘాటించారు. రాబోయే నెలల్లో జరగనున్న పార్టీ కార్యకలాపాలపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు.

వికేంద్రీకరణతో ప్రజలకు మేలు..

పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు ఎంతో సదుపాయమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మరిన్ని సంక్షేమ ఫలాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వేగంగా అందించాలనే తలంపుతోనే వికేంద్రీకరణ సంస్కరణలు చేపట్టారని చెప్పారు. అందులో భాగంగానే కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు,గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల ఇంటిముందుకు వెళ్లేలా చేశారన్నారు.అదే స్ఫూర్తితో జీహెచ్ఎంసీలోనూ వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా నగర ప్రజలకు సత్వరమే కాక మరిన్ని సేవలందుతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వార్డు కార్యాలయ వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదన్నారు. వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవాలకు తమ పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు,కాలనీ సంఘాలు, ప్రముఖులను కలుపుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వార్డు కార్యాలయ వ్యవస్థపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఒక విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,ఎమ్మెల్సీలు నవీన్‌రావు,శంభీపూర్ రాజు, మేయర్ విజయలక్ష్మి,మాజీ మేయర్ బొంతురామ్మోహన్,పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి తలసాని, మేయర్ విజయలక్ష్మి తదితరులు

కార్పొరేటర్లకు క్లాస్

- ఎమ్మెల్యేలతో పోటీ పడొద్దు
- లేదంటే పార్టీ నష్టపోతుంది
- పార్టీ ఇచ్చిన పనిచేయండి
- ఎమ్మెల్యేలతో సమస్యలుంటే చెప్పండి

కొన్ని నియోజకవర్గాల్లో కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలతో విభేదాలుండటాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ‘మీరు ఎమ్మెల్యేలతో పోటీపడుతున్నారు. మీకు మీరే ఎమ్మెల్యేలుగా భావిస్తున్నారు. పార్టీ ఇచ్చిన పని చేయండి. మీ సేవల్ని పార్టీ గుర్తిస్తుంది. జాతీయ పార్టీగా ఎదుగుతున్న క్రమంలో ఈ వైఖరి మంచిది కాదు. ఎవరికి వారే ఎమ్మెల్యేలనుకుంటే పార్టీ నష్టపోతుంది. కలిసిమెలిసి పనిచేయాలి. ఎవరికి టిక్కెట్ ఇవ్వాలన్నది సమయం వచ్చినప్పుడు పార్టీ నిర్ణయిస్తుంది. ఎమ్మెల్యేలతో మీకు ఏవైనా సమస్యలుంటే నాదృష్టికి తెండి. రాబోయే రోజులు ఎంతో కీలకమైనవైనందున అందరూ కలిసిమెలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. చాలామంది కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సైతం మంత్రి తప్పుబట్టారు. అన్ని సమావేశాలకు తప్పనిసరి హాజరు కావాలని ఆదేశించారు. మేయర్ సైతం తరచూ టీ, కాఫీ చర్చల వంటివి ఏర్పాటు చేయాలని.. అందరూ పార్టీకోసం పని చేయాలన్నారు. ప్రజా సమస్యలు విస్మరించొద్దు. వార్డు కార్యాలయాలకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారమయ్యేలా చూడాలి. మీరు చెప్పేవి చేసేలా అధికారులుండాలని చెప్పినట్లు సమాచారం. వార్డుకార్యాలయాలను కార్పొరేటర్లతోనే ప్రారంభింపజేయాలని,కార్పొరేటర్లు లేని ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంటివారితో ప్రారంభింపజేయాలని సూచించినట్లు సమాచారం.

దొంగలు చెప్పడంతోనే..

- చోరీకి గురైన సొత్తు ఎంతో యజమానికే తెలియదు
- ఇద్దరు నిందితుల రిమాండ్

హిమాయత్‌నగర్: దొంగలు అపహరించిన సొత్తు ఎంతో ఆ ఇంటి యజమానికే తెలియదు. తాము దోచుకున్న సొమ్ము ఇంత అని నిందితులు చెబితేనే వెలుగులోకి వచ్చిన ఘటన ఇది. కొద్దిరోజుల క్రితం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును స్పెషల్ జోనల్ క్రైం టీం (సీసీఎస్) ఛేదించింది. 209 గ్రాముల బంగారు, 1250 గ్రాముల వెండి ఆభరణాలు, ఐఫోన్, రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ డీసీపీ డాక్టర్ శబరీష్ తెలిపారు. నిందితులు మహ్మద్ షహబాజ్ హుస్సేన్, మహ్మద్ ఇర్ఫాన్‌లను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ఏసీపీ హరీష్ కౌశిక్, ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, మాదన్నపేట డీఐ అర్లప్పలతో కలిసి సీసీఎస్ డీసీపీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో తాలబక్తకు చెందిన మహ్మద్ షహబజ్ హుస్సేన్, షాహీన్‌నగర్‌లోని ఆల్‌జబ్రీ కాలనీకి చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌లు సుదర్శన్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 4న ఇంటికి వచ్చిన సుదర్శన్ సింగ్ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను స్పెషల్ జోనల్ టీం నగరంలో పట్టుకుంది. బంగారు, వెండి ఆభరణాలు, ఐఫోన్, రూ.35 వేలు దొంగిలించినట్లు నిందితులు అంగీకరించారు. కాగా.. ఇంట్లో ఇంత మొత్తంలో ఆభరణాలు చోరీకి గురైన విషయం యజమానికి తెలియదని, చోరీకి పాల్పడ్డ ఇద్దరి నుంచి రికవరీ చేసిన సొత్తు చూపించిన తర్వాత.. ఇంట్లో అన్ని ఆభరణాలు చోరీకి గురైన సంగతి తెలుసుకుని యజమాని అవాక్కైనట్లు డీసీపీ వెల్లడించారు.

'విద్యాహక్కు'ను కఠినతరం చేయండి

ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్


దీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

బడంగ్‌పేట్: విద్యాహక్కు చట్టాన్ని కఠినతరం చేసి ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్రమోని భాను ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం డీఈఓ నందుకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు 25 శాతం ఫీజు మినహాయింపు అమలు చేసేలా చూడాలని కోరారు. జర్నలిస్టులకు 50 శాతం మినహాయింపు ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలు నడిపిస్తూ న్యూఅకాడమిక్‌కు అడ్మిషన్లు స్వీకరిస్తున్న పాఠశాలలను గుర్తించి సీజ్ చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నారని డీఈఓకు చెప్పారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీ చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులతో పాటు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం పూర్తిగా అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు.

నకిలీ సంఘాలను సృష్టించిన రిసోర్స్ పర్సన్‌పై కేసు

- బోగస్ పత్రాలతో రెండు బ్యాంకుల్లో రూ.34 లక్షల రుణాలు
- నకిలీ స్టాంపులు, సంతకాలు
- ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ కమిషనర్

శంషాబాద్: నకిలీ మహిళా స్వయం సహాయక సంఘాలను సృష్టించిన రెండు బ్యాంకుల నుంచి రూ. 34 లక్షల రుణాలు పొందిన రిసోర్స్ పర్సన్‌తో పాటు ఆమెకు సహకరించిన ఉద్యోగిపై శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్‌బీనగర్‌లో నివాసం ఉండే కె.రత్న (40) స్వయం సహాయసంఘాలకు సంబంధించిన రిసోర్స్ పర్సన్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తోంది. పట్టణంలోని కాపుగడ్డ తదితర బస్తీలకు చెందిన నాలుగు స్వయంసహాయక సంఘాలకు చెందిన గ్రూపుల్లో ఉన్న సభ్యులకు తెలియకుండా వాటిలోనే ఇతరుల ఫొటోలు చేర్పించింది. నకిలీ సంతకాలు చేసి గ్రూపు సభ్యులకు తెలియకుండా పట్టణంలోని రెండు బ్యాంకుల నుంచి రూ. 34 లక్షల రుణం తీసుకుని సొంతానికి వాడుకుంది. బ్యాంకు అధికారులు గ్రూపులోని అసలు సభ్యులకు ఫోన్లు చేసి రుణాలు చెల్లించాల్సిందిగా సూచించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రిసోర్స్‌పర్సన్‌తో పాటు వీటిని పర్యవేక్షించే మరో అధికారి హన్మంత్ రెడ్డి కూడా రిసోర్స్‌పర్సన్ చేసిన మోసాల్లో భాగస్వామిగా ఉన్నట్లు సమాచారం. దీనిపై జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా చేపట్టిన అధికారులు పరిశీలనలో వెల్లడైంది. మున్సిపాలిటీకి సంబంధించిన నకిలీ స్టాంపులు కూడా తయారు చేసి ఫోర్జరీ సంతకాలు చేసినట్లు పరిశీలనలో తేలింది. వీటితో పాటు మరికొన్ని సంఘాల నుంచి కూడా వీరిద్దరు రుణాల కోసం అధికారుల సంతకాల పేరిట వసూళ్లకు పాల్పడినట్లు కమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్‌జీఐఏ పోలీసులు రిసోర్స్ పర్సన్ రత్న, అధికారి హన్మంత్‌రెడ్డిలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల దొంగలకు రిమాండ్

కొత్తూర్: పశువులను దొంగిలించిన వ్యక్తులను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 1న మండల పరిధిలోని బోటిగూడ గ్రామానికి చెందిన గౌరారం యాదమ్మ పశువులను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన సీసీ కెమెరాల సాయంతో దొంగలను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాకు చెందిన కోటేశ్వర్ రావు, పల్నాడు జిల్లాకు చెందిన చుక్క కృష్ణ మండల పరిధిలో వేర్వేరు మామిడితోటల్లో పనులు చేసుకునేవారు. ఈ నెల 1 రాత్రి కిరాయి ఆటోను తీసుకువచ్చి మామిడితోట పక్క పాకలో ఉన్న పశువులను దొంగిలించారు. చుక్క కృష్ణ పనిచేసే మామిడితోట ఎదుట ఉన్న పొలంలో పశువులను ఉంచారు. ఎస్ఐ శంకర్, సిబ్బంది అబ్దుల్లా, కుమార్, మహిపాల్, రవీందర్‌లు సీసీ కెమెరాల సాయంతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ గ్రామంలో అరెస్టు చేసిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రభుత్వ భూమిని విక్రయించిన వ్యక్తిపై కేసు

శంషాబాద్: ప్రభుత్వ భూమిని సొంత ప్లాటుగా నమ్మించి ఓ కుటుంబాన్ని మోసం చేసిన వ్యక్తిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. సిద్ధాంతికి చెందిన సున్నం రాజు (40) ఎయిర్‌పోర్టు కాలనీలోని ప్రభుత్వానికి చెందిన ఎంఐజీ ప్లాటు 106 తనదిగా నమ్మించి ఆర్‌బీనగర్‌లో నివసించే నక్క శ్రీలత, శ్రీరాములు దంపతుల నుంచి కొంతకాలం క్రితం రూ. 3 లక్షలు తీసుకున్నాడని సమాచారం. డబ్బులు చెల్లించిన దంపతులు ప్లాటు గురించి ఆరా తీయడంతో అది ప్రభుత్వ స్థలమని తేలింది. దీంతో వారు మోసపోయినట్లు గ్రహించి ఇంటికి వెళ్లి తిరిగి డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోగా.. సదరు వ్యక్తులపై కుక్కలను వదిలేయడం, కొట్టడం, బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులకు ఏడేళ్ల జైలు

ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా

ఇబ్రహీంపట్నం: ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు తీర్పు నిచ్చారు. ఎస్ఐ మారయ్య తెలిపిన ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన సార్ల సంతోషకు ఇబ్రహీంపట్నం వాసి యాదగిరితో 2004లో వివాహం చేశారు. బంగారం, వెండి కట్నకానుకలిచ్చారు. భర్త ఇంట్లోలేని సమయంలో అత్త ముత్యాలు, మామ చంద్రయ్య, ఆడపడుచు సునీతలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశారు. వేధింపులు తాళలేక ఆమె 2020 అక్టోబరు 3న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే ఆమెకు చికిత్స నిమిత్తం నగరంలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేవిధంగా ఆధారాలు సేకరించి న్యాయస్థానానికి సమర్పించిన పోలీసు సిబ్బందిని రాచకొండ కమిషనర్ చౌహాన్, జాయింట్ సీపీ సత్యనారాయణ అభినందించి రివార్డులు ప్రకటించారు.

ప్రేమలో గెలిచి.. బతుకులో ఓడారు

పెళ్లికి అంగీకరించని పెద్దలు

- ఆరు నెలల క్రితమే వివాహం
- మనోవేదన, ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరూ కలిసి బలవన్మరణం
- మృతదేహాలను ఎవరికి వారు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపిన ఇరు కుటుంబాలు


ఆంజనేయులు మృతదేహం


మృతురాలు వైష్ణవి

కీసర: వారిద్దరూ ప్రేమించుకున్నారు. కానీ వారి పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. చేసేదేమీలేక ఇద్దరూ కలిసి వివాహం చేసుకున్నారు. ఆర్నెల్లుగా వేరే కాపురం పెట్టారు. ఈ క్రమంలో మనోవేదనతో పాటు ఆర్థిక ఇబ్బందులతో ఆ నవ దంపతులిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. దహన సంస్కారం కోసం ఇరు కుటుంబాలు వేర్వేరుగా ఆ యువతీ యువకుల మృతదేహాలను తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రేమించి.. పెళ్లి చేసుకుని.. జీవితంలో ఒక్కటైన ఆ జంట..చివరకు మృత్యువులోనూ నీతోనే నేనంటూ కన్నుమూశారు.

మృతదేహాలను వేర్వేరుగా ఎవరి కుటుంబం వాళ్లు తీసుకెళ్లి దహన సంస్కారాలు జరిపించారు. ప్రేమలో గెలిచి.. పెళ్లితో ఒక్కటై జీవితం పంచుకున్న ఈ జంట.. చివరకు విడిపోయి చితికి చేరిన ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో చోటుచేసుకుంది. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కేశవపురం గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు (25) నగరంలోని కాప్రా జమ్మిగడ్డకు చెందిన వైష్ణవి (22) ప్రేమించుకుని ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాల వాళ్లకు దూరంగా నాలుగు నెలల నుంచి అహ్మద్‌గూడలోని ఆర్‌జీకే కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఆంజనేయులు, వైష్ణవి వేర్వేరుగా బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

ఆమె ఉరి వేసుకుని.. అతను పురుగుల మందు తాగి

మొదట వైష్ణవి గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. ఆ తర్వాత ఆంజనేయులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తాము బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు యువ జంట రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా..పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాలను ఎవరి కుటుంబ సభ్యులు వారు తీసుకెళ్లారు. ఆంజనేయులు మృతదేహాన్ని కేశవపురానికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేయగా.. వైష్ణవి మృతదేహాన్ని జమ్మిగడ్డకు తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రేమలో గెలిచి.. పెళ్లి ఒక్కటై.. మృతిలో తోడుగా ఉండి.. ఆఖరికి చితిలో మాత్రం వేరయ్యారు.

శ్మశానవాటిక కబ్జా!


శ్మశానవాటికలో కబ్జా చేసి ప్రహరీ నిర్మించిన అక్రమార్కులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడ దళితుల శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. సమాధులను కబ్జా చేస్తూ.. ప్రహరీలను నిర్మిస్తున్నా.. రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. శ్మశానవాటికతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో యదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని దీనిపై రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఎమ్మార్వో ఈ విషయంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు. లక్ష్మీగూడ సర్వేనెంబర్ 52లో ప్రభుత్వ స్థలం ఉంది. కాగా గతంలో ఈ స్థలంలోని కొంత స్థలాన్ని దళితుల శ్మశానవాటిక కోసం కేటాయించారు. కొందరు కబ్జాదారులు ప్రస్తుతం ప్రభుత్వ స్థలంతో పాటు శ్మశన వాటిక స్థలంలో ప్రహరీలను నిర్మిస్తున్నారని సమాదులను సైతం పెకిలించి కబ్జా చేస్తున్నారనే విమర్శలున్నాయి. స్థానికులు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాల నుంచి శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఉత్తమ పరిశోధకులకు అవార్డులు


అవార్డులను అందుకుంటున్న రచయితలు, పీహెచ్‌డీ విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో ఉత్తమ వ్యవసాయ విస్తరణ పరిశోధకులకు అవార్డులను ప్రదానం చేశారు. సహజ వ్యవసాయ పద్ధతులు, రైతులకు ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ, వ్యవసాయ యూట్యూబర్‌లు, కూరగాయలలో మార్కెటింగ్, సామాజిక పర్యావరణ పరిరక్షణ వ్యవసాయం, తదితర విభాగాల్లో పుస్తకాలు రాసిన వారికి పీహెడీ విద్యార్థులు, పండితులు, రచయితలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ చంద్రశేఖర మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణలో పరిశోధనలను జాతీయ ప్రాధాన్యతల వైపు మళ్లించాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అనువర్తిత పరిశోధనాలపై దృష్టిసారించాలన్నారు. ఎస్ బాలసుబ్రమణి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాల సీజ్


పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ఆమనగల్లు: పట్టణంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గ్లోబల్ ప్రైడ్ పాఠశాలను మంగళవారం అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఏడాది గ్లోబల్ ప్రైడ్ పాఠశాలను ప్రారంభించి నిర్వహిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమనగల్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ అనుమతులు లేని పాఠశాలను సీజ్ చేశారు. అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు.

పాల వ్యాన్, బైక్ ఢీ..

ఒకరికి గాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: పాల వ్యాన్‌ను రాంగ్‌రూట్‌లో వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో ద్విచక్రవాహన దారుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కాకునూర్‌కు చెందిన మాధవాచారి బైక్‌పై గ్రామం నుంచి షాద్‌నగర్ వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాడు. తాగిన మైకంలో ఎదురుగా వస్తున్న పాలవ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మద్యం సేవించి, బైక్ ట్యాంక్ కవర్‌లో మద్యం బాటిళ్లతో వెళ్తున్న యువకుడిపై పాల వ్యాన్ డ్రైవర్ రఘుపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


చాంద్‌పాషా మృతదేహం

శంకర్‌పల్లి: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మోకిల పీఎస్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ నరేశ్ తెలిపిన ప్రకారం.. రాజేంద్రనగర్ మండల పరిధిలోని సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ చాంద్‌పాషా(32) సోమవారం పని నిమిత్తం తన బైక్‌పై శంకర్‌పల్లి వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో మోకిల మీదుగా వస్తుండగా 11.50గంటల ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో చాంద్‌పాషా రోడ్డుపై పడ్డాడు. హెల్మెట్ ధరించకపోవడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రయాణికుల సంక్షేమానికే టీఎస్ ఆర్టీసీ


'డయల్ యువర్ డీఎం'లో డిపో మేనేజర్ ఉష

షాద్‌నగర్‌రూరల్: టీఎస్ఆర్టీసీ ప్రయాణికుల సంక్షేమానికే పని చేస్తోందని డిపో మేనేజర్ ఉష అన్నారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల మస్యలను తెలుసుకునేందుకు మంగళవారం ఆమె డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం ఉషకు ప్రయాణికులు ఫోన్‌లో తమ సమస్యలను వివరించారు. ప్రయాణికుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ డీఎం సమాధానాలు ఇచ్చారు. అనంతరం డీఎం ఉష మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ సంస్థను అభివృద్ధి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సంస్థను ప్రగతిపథంలో నడిపించేందుకు ఉద్యోగులు, సిబ్బంది తోడ్పాటును అందించాలని కోరారు.

ఎండ తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

మంచాల: ఎండల తీవ్రత కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన ఆరుట్లలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలోని కుర్మ బస్తీ సమీపంలో నాటకాని చెరువు కట్టకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఎండల తీవ్రతతో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ వేడి ఎక్కువయి మంటలు చెలరేగాయి. దీంతో పరిసర ప్రాంతంలో చెట్లు, గడ్డి కాలి బూడిదయ్యాయి.

యువతి అదృశ్యం


చైతన్య (ఫైల్)

శంషాబాద్: యువతి అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సాతంరాయి కూలీ పనులు చేసుకుంటూ నివసించే గొరప్ప చిన్న కుమార్తె చైతన్య (18) సమీపంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి ఈనెల 12 మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోట వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.